క్లుప్తంగా...

దరఖాస్తుల ఆహ్వానం

చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాల (అటానమస్)లో 2023–24 సంవత్సరానికి వివిధ విభాగాల్లో తాత్కాలిక అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాలభాస్కర్ తెలిపారు. ఆంగ్లం–2, సంస్కృతం–1, బీబీఏ–2, బిజినెస్ ఎనలటిక్స్–1, డాటా సైన్స్–1, అప్లైడ్ న్యూట్రిషన్–1, అరబిక్–1, బీబీఏ రిటైల్–2, బీసీఏ–2, బయో టెక్నాలజీ–1, కంప్యూటర్ సైన్స్–6, ఎకనామిక్స్ ఆనర్స్–2, హిస్టరీ ఆనర్స్–2, పొలిటికల్ సైన్స్–2, స్టాటిస్టిక్స్–1, టాక్సేషన్–1, ఫారిన్ ట్రేడ్–1 పోస్టులకు గాను తగిన విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 24వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు కళాశాలలో అందజేయాలన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో 55 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు హాజరు కావచ్చునని.. పీహెచ్‌డీ, ఎంఫిల్, నెట్, స్లెట్ వంటి అదనపు అర్హతలతో పాటు బోధనానుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9032138442లో సంప్రదించాలన్నారు.

ముగిసిన ఉర్సు ఉత్సవాలు



లంగర్‌హౌస్: లంగర్‌హౌస్‌లోని దర్గా ఈ హజ్రత్ సయ్యద్ షా మీరన్ హుస్సేని బాగ్దాదీ ఖాద్రీ దర్గాలో 395వ ఉర్స్–ఏ–షరీఫ్ ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. దర్గా మోతావలి సజ్జద నషీన్ సయ్యద్ సాదుద్దీన్ మొహమ్మద్ ఖాద్రీ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహించారు. చివరి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉదయం 8 గంటలకు ఖత్మే–ఖురాన్ షరీఫ్, 10 గంటల నుంచి అన్నదానం, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాంస్కృతిక ఖవ్వాలీ, ఖుల్ కార్యక్రమాలతో ఉర్స్ ఉత్సవాలు ముగిశాయి. దర్గా నిర్వాహకులు సయ్యద్ హమీద్ మొహినుద్దీన్ ఖాద్రి, సయ్యద్ నజాముద్దీన్ అహ్మద్ ఖాద్రి, సయ్యద్ సుల్తాన్ అహ్మద్ ఖాద్రి, షేక్ ఫర్వేజ్ అహ్మద్ ఖాద్రి పాల్గొన్నారు.

వాటర్‌బోర్డు సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం



జీఎం జాన్ షరీఫ్‌తో ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: ఏ ప్రాంతంలోనైనా వాటర్‌బోర్డు సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరిస్తామని వాటర్‌బోర్డు 4వ డివిజన్ జనరల్ మేనేజర్ జాన్ షరీఫ్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ నియోజకవర్గంలో ఉన్న తాగునీరు, డ్రైనేజీ, ఇతర సమస్యలను పరిష్కరించాలని వివరించారు. ఈ సందర్భంగా జాన్ షరీఫ్ మాట్లాడుతూ.. అన్ని ప్రాంతాల్లో ఉన్న సమస్యలను సంబంధిత డీజీఎంలు, మేనేజర్లు పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



నాంపల్లి: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ తన్నీరు శ్రీరంగారావుపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం నాంపల్లి క్రిమినల్ కోర్టు నుంచి నాంపల్లి చౌరస్తా వరకు ర్యాలీని నిర్వహించారు. అనంతరం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. న్యాయవాది పులిగారి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. న్యాయవాదులు, ప్లీడర్లు చెట్టుకింద గొడుగులు అంటూ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో న్యాయవాదుల మనోభావాలు దెబ్బతిన్నాయని మండిపడ్డారు. ఓటుకు నోటు కేసులో న్యాయవాదులే వాదిస్తున్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హితువు పలికారు. ఒక పెయింటర్ టీపీసీసీకి అధ్యక్షుడైనప్పుడు ఒక న్యాయవాది తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలికి చైర్మన్ అయితే తప్పేముందని చురకలు అంటించారు.

నేడు బోనాల జాతర ముగింపు సమావేశం

చార్మినార్: బోనాల జాతర ఉత్సవాలను ముగింపు సమావేశాన్ని ఈనెల 19న లక్ష్మీ గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ప్రతినిధులు తెలిపారు. చంపాపేట్‌లోని లక్ష్మీ గార్డెన్‌లో బుధవారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ముగింపు సమావేశం జరుగుతుందని తెలిపారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



లీడర్లుగా ఎంపికైన విద్యార్థులతో సాయిసుమన్, డీన్ ప్రియామనీష్ తదితరులు



వేడుకల్లో విద్యార్థులతో కల్నల్ సుజిత్‌కుమార్

విజయనగర్‌కాలనీ: విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఎయిర్‌ఫోర్స్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాయిసుమాన్ అన్నారు. మంగళవారం విజయనగర్‌కాలనీ రవీంద్రభారతి పాఠశాలలో నిర్వహించిన ఇన్వెస్టిట్యూర్ సెర్మని కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై క్లాస్ లీడర్లుగా ఎంపికైన విద్యార్థులకు బ్యాడ్జీలను అందజేసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలోనే ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని చేరేంతవరకు నిరంతరం కృషి, పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రవీంద్రభారతి విద్యాసంస్థల డీన్ ప్రియామనీష్, ప్రిన్సిపాల్ నూరిన్ ఫాతిమా, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



బ్యాడ్జీలు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ పరిమళ, జోనల్ డీన్ జ్యోతి

టోలిచౌకి సూర్యనగర్ కాలనీలో..

గోల్కొండ: క్రమశిక్షణ విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేస్తుందని కల్నల్ సుజిత్‌కుమార్ అన్నారు. మంగళవాం టోలిచౌకి సూర్యనగర్ కాలనీలోని రవీంద్రభారతి పాఠశాలలో ఇన్‌వెస్టిచర్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన ఎన్నికైన లీడర్లకు బ్యాడ్జీలను అందించారు. విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలు అలవర్చుకున్న వారు తాము ఎంచుకున్న రంగాల్లో విశేషంగా రాణిస్తారని అన్నారు. రవీంద్రభారతి పాఠశాలల మెహదీపట్నం జోన్ డీన్ ప్రియామనీష్, ప్రిన్సిపాల్ శశికళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐ.ఎస్.సదన్ రవీంద్రభారతి పాఠశాలలో..

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని ఐ.ఎస్.సదన్ రవీంద్రభారతి పాఠశాలలో మంగళవారం ఇన్వెస్టిచర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐ.ఎస్.సదన్ ఎస్సై అశోక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలను అందజేశారు. ప్రిన్సిపాల్ పరిమళ, జోనల్ డీన్ జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేపు ప్లాస్టిక్ నివారణపై అవగాహన ర్యాలీ

చార్మినార్: జాతీయ ప్లాస్టిక్ నివారణ దినోత్సవం సందర్భంగా ఈనెల 20న తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గౌలిపురా జ్ఞాన భారతి మోడల్ హై స్కూల్ నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ (టీసీసీ) రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్, టీసీసీ పాతబస్తీ అధ్యక్షులు ఎస్.రామకృష్ణ శాస్త్రి తెలిపారు. ముఖ్యఅతిథులుగా ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ కె.పురుషోత్తం రెడ్డి, తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేశ్ అగర్వాల్ పాల్గొని అవగాహన ర్యాలీ ప్రారంభిస్తారన్నారు. ప్లాస్టిక్ వస్తువులు, బ్యాగ్‌లతో కలిగే అనర్థాలు, నివారణపై ప్రసంగిస్తారన్నారు. ఆయనతో పాటు ప్రముఖ విద్యావేత్త వి.ప్రభాకర్, లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సౌత్ డైరెక్టర్ లయన్ ప్రేమ్‌చంద్ మనోత్ జైన్‌లు పాల్గొంటారన్నారు. 30 ఏళ్లుగా పర్యావరణ పరిరక్షణకై ర్యాలీలు, సదస్సుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తూ చైతన్యవంతులను చేస్తున్న ప్రముఖ పర్యావరణవేత్త ప్రొ. పురుషోత్తంరెడ్డి, తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మహేశ్ అగర్వాల్‌ను సన్మానించనున్నామన్నారు.

త్రివేణి సంగంలో నిమజ్జనంతో ముగిసిన బోనాలు



యువకులతో కలిసి పూజల్లో ఎస్సై శివకుమార్

లంగర్‌హౌస్: త్రివేణి సంగంలో తొట్టెల నిమజ్జనంతో బోనాల ఉత్సవాలు ముగిశాయి. లంగర్‌హౌస్ వద్ద ఉన్న త్రివేణి సంగంలో అమ్మవార్లకు సమర్పించిన తొట్టెలను నిమజ్జనం చేయడం ఆనవాయితి. మంగళవారం తెల్లవారుజామున నిమజ్జనాలు పూర్తి కావడంతో బోనాల ఉత్సవాలు ముగిశాయి. సోమవారం రాత్రి వివిధ ఆలయాల నుంచి తొట్టెల ఊరేగింపుతో పాటు ఫలహారం బండ్ల ఊరేగింపు ప్రారంభించారు. అన్ని లంగర్‌హౌస్ మార్కెట్‌కు చేరుకున్నాక అక్కడ బుజిలీ మహంకాళి ఆలయ తొట్టెలతో కలిసి సామూహిక ఊరేగింపుగా కొనసాగారు. నగర పొలిమేర ఆలయం గుండు పోచమ్మ ఆలయం వద్ద చివరిసారిగి ఆరెళ్ల క్రిష్టాయాదవ్, వసంత్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో హారతి ఇచ్చి త్రివేణి సంగంలో తొట్టెల నిమజ్జనం చేశారు. ఈ ఉత్సవాల్లో గోల్కొండ జగదాంబిక ఆలయం కమిటీ చైర్మన్ జగదీష్‌యాదవ్, నాయకులు కోయల్‌కర్ శ్రీనివాస్, పరమేశ్, గోవింద్‌రాజ్, గరిషె కార్తీక్ పాల్గొన్నారు.



శాస్త్రీయ కళలపై మక్కువ పెంచాలి

గన్‌ఫౌండ్రీ: నేటి యువతరానికి చిన్నప్పటి నుంచే భారతీయ కళల పట్ల మక్కువ కల్పించాలని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్.వేణుగోపాల చారి అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో శృతిజ మొదటి వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారులకు శాస్త్రీయ సంగీత కళలపై తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం సంగీత దర్శకుడు నాగేశ్వర్‌ను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో భారత ఆర్ట్స్ అకాడమి అధ్యక్షురాలు లలిత రావు, భారత్ వరల్డ్ రికార్డ్స్ అధ్యక్షుడు కేవీ రమణా రావు, సంగీత గురువు విష్ణుప్రియ పాల్గొన్నారు.

సన్మానం



జలమండలి డీజీఎం ఖాజా జౌహర్‌అలీని సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: ప్రజల మధ్యలో ఉండి వారి సమస్యలను పరిష్కరించే అధికారులనే ప్రజలు గౌరవిస్తారని గోల్కొండ పీస్ అండ్ మైత్రి కమిటీ చైర్మన్ ఎస్. రాజు వస్తాద్ అన్నారు. బోనాల ఉత్సవాల్లో గోల్కొండ కోటకు వచ్చే భక్తులకు జలమండలి వారు ఉచితంగా తాగునీరు అందిస్తున్న సందర్భంగా మంగళవారం ఆయనను గోల్కొండలో పీస్ అండ్ మైత్రికమిటీ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోటలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఉచిత తాగునీటి క్యాంపులను ఖాజా జౌహర్ అలీ సమర్థవంతంగా నిర్వహించారన్నారు. ఖాజా జౌహర్ అలీ స్ఫూర్తితో ఇతరుల అధికారులు కూడా సమర్థవంతంగా తమ విధులు నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మైత్రి కమిటీ సభ్యులు అక్బర్, పరమానందం, టి. సత్యనారాయణ, ఎం.ఏ బేగ్, తహసీమ్ పాషా, పటేల్ తదితరులున్నారు.

వైభవంగా అమ్మవారి శాంతి కల్యాణం



అమ్మవారికి శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాకుత్‌పురా: బోనాల ఉత్సవాల్లో భాగంగా హరిబౌలి గజానన వ్యాయామశాలమాతేశ్వరి పోచమ్మ మహంకాళి ఆలయంలో మంగళవారం అమ్మవారి శాంతి కల్యాణం ఘనంగా జరిగింది. ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణతో ప్రత్యేక పుజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి శాంతి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. 5 వారాల పాటు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక కుంకుమార్చన కార్యక్రమం చివరి రోజు కావడంతో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలకు అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కేడాల దినేష్, ప్రకాష్, గోపాల్‌యాదవ్, శైలేష్, శ్రావణ్, ప్రశాంత్, రవీందర్, శ్రీనివాస్, వేదసాయిలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆలయ వార్షికోత్సవ వేడుకలు ప్రారంభం



డబీర్‌పురా: డబీర్‌పురా కోమటివాడిలోని పిలక్‌మాత (శ్రీ శీతలాదేవి) ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వార్షికోత్సవాల్లో భాగంగా ఉదయం 6 గంటలకు గణపతి పూజ, అఖండ దీపారాధన, మాతృక స్థాపనం, రక్షా బంధనం, ఉదయం 11 గంటలకు శ్రీ చండీ ఉపాసకులు మహామంత్రద్రష్ట బ్రహ్మశ్రీ కేతినేడి త్యాగరాజయ్య స్వామిజీతో మహాధాహ్వానం తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవాల్లో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కృష్ణకుమార్, నారాయణ, భాస్కర్, ఉపాధ్యక్షులు రఘు, జగదీష్, ప్రధాన కార్యదర్శి మహేందర్, జాయింట్ సెక్రటరీ జగదీశ్వర్, ఎన్.కృష్ణ, కోశాధికారి ఎం.కరుణాకర్, అసిస్టెంట్ కోశాధికారి జి.రాము, సెక్రటరీలు జి.సాయి కుమార్, వి.సాగర్‌తో పాటు కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే తెలంగాణ పండగలకు ఆదరణ



నందకిశోర్ వ్యాస్ బిలాల్‌కు మెమొంటోను అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

అబిడ్స్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే తెలంగాణ పండుగలకు ఆదరణ లభిస్తుందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. చుడిబజార్ ప్రాంతంలోని ఆలయ నిర్వాహకులు నందకిశోర్ వ్యాస్ బిలాల్‌కు అమ్మవారి మెమొంటోను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే అన్ని పండగలను ప్రభుత్వమే స్వయంగా చేపడుతుందన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాన్ని చాటే విధంగా తెలంగాణ పండుగలు దోహదపడుతున్నాయన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేపడుతున్న ప్రగతి, సంక్షేమం, అభివృద్ధి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, కోటి శైలేష్ కురుమ, ప్రదీప్‌రాజ్, పప్పుమాత్రే పాల్గొన్నారు.

ఘనంగా అధిక శ్రావణమాస పూజలు

జియాగూడ: శ్రీ సమర్థ సద్గురు నారాయణ ఆశ్రమంలో అధిక శ్రావణమాస పూజలు మంగళవారం ఘనంగా మొదలయ్యాయి. ఆశ్రమ పీఠాధిపతి ప్రభుదత్త మహరాజ్ ఆధ్వర్యంలో నెలరోజుల పాటు కొనసాగుతాయి. మంగళవారం దాసాంజనేయస్వామి, స్ఫటిక లింగానికి రుద్రాభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు, అఖండ హారతి, గోపూజ, అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. అనంతరం ప్రభుదత్త మహరాజ్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరి ఆరోగ్య శ్రేయస్సు కోసం పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నేటి నుంచి ఆగస్టు 16 వరకు ప్రతిరోజూ ఆలయంలో హరిహరేశ్వరుడు, సీతారామచంద్రస్వాములు, శివాలయం సమర్థ నారాయణ మహారాజ్ మందీర్, గజలక్ష్మి, ఆంజనేయస్వామి దేవాలయాల్లో పూజలు కొనసాగుతాయని తెలిపారు.

జోరుగా ఫలహారం బండ్ల ఊరేగింపు



కేశవస్వామి ఫలహారం బండి ఊరేగింపులో శివయాదవ్, లక్ష్మీనారాయణ్, జగదీష్‌యాదవ్

జియాగూడ: జియాగూడలోని పలు ప్రాంతాల నుంచి మాతేశ్వరీల ఫలహారం బండ్లు, తొట్టెల ఊరేగింపులు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. జియాగూడ నుంచి ప్రారంభమైన ఊరేగింపులు కార్వాన్ ఊరేగింపులోకి విలీనమయ్యాయి. దుర్గానగర్‌లోని ఫలహారం బండి వద్దకు బీఆర్‌ఎస్ నాయకుడు, అధ్యక్షుడు నరహరిచారి, ప్రధాన కార్యదర్శి సి.బాబు, దేవేందర్‌సాగర్, గోపాల్, ప్రకాష్, హరి ఓం తదితరులు హాజరయ్యారు. అలాగే కేశవస్వామినగర్ ఫలహారం బండి ఊరేగింపు వద్దకు బీజేపీ గోల్కొండ జిల్లా డైయిరిఫారమ్ సెల్ కన్వీనర్ శివకుమార్‌యాదవ్, అధ్యక్షుడు లక్ష్మీనారాయణ్, బీసీ అధ్యక్షుడు జగదీష్‌యాదవ్, అశోక్, గజ్జి రమేష్ తదితరులు హాజరయ్యారు. అలాగే జియాగూడ కురుమ సంఘం తొట్టెల ఊరేగింపుకు డాక్టర్ నవీన్‌కుమార్ హాజరు కాగా అధ్యక్షుడు ఉల్పె నర్సింగ్‌రావు ఘనంగా సన్మానించారు. మంతటి నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్‌ను పంపిణీ చేస్తున్న డాక్టర్ ఎస్‌ఎం.ముజీబ్ హుస్సేని తదితరులు

అబిడ్స్: టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా, అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేపట్టారు. టీఎన్జీఓస్ సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని మంగళవారం విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంతరం సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలు దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నాయన్నారు. సీఎం కేసీఆర్ స్ఫూర్తితోనే తాను సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విక్రమ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్, నరేష్, ఖాలీద్ అహ్మద్, వైదిక్ శాస్త్రి, శంకర్, ఎంఏ ముజీబ్, రామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, చాంద్‌పాషా, చంద్రశేఖర్, హెచ్ఎం సైదా షానాజ్, ఉస్మాన్ అలీ, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

దంచి కొట్టిన వాన



టూంబ్స్ చౌరస్తా–టోలిచౌకి రోడ్డుపై వర్షపు నీరు

గోల్కొండ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానతో ప్రజలు హైరానా పడుతున్నారు. మంగళవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షం వల్ల రోడ్లు జలమయమయ్యాయి. టోలిచౌకి, షేక్‌పేట్, టూంబ్స్ చౌరాస్తాతో పాటు గుడిమల్కాపూర్ తదితర ప్రాంతాల్లోని రోడ్లు వరద నీటి ప్రవాహంతో కాలువలా మారాయి. దీంతో వాహనాల రాకపోకలు నెమ్మదించాయి. ఇదిలా ఉండగా నాలాల్లో వర్షపు నీరు నిలిచింది. శాతం తలాబ్, గోల్కొండ కతోర హౌస్, షేక్‌పేట్ కొత్త చెరువు తదితర ప్రాంతాల్లోని కొత్త చెరువు జలకళను సంతరించుకున్నాయి. టోలిచౌకి, మహ్మదీ లైన్స్ తదితర ప్రాంతాలలో పైప్‌లైన్ తవ్వుతున్న ప్రదేశాలు బురదమయంగా మారాయి.

రేపటి నుంచి మొహర్రం సంతాప దినాలు

డబీర్‌పురా: మొహర్రం సంతాప దినాలకు డబీర్‌పురాలోని బీబీకా అలావాలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బీబీకా అలావా నిర్వాహకులు ఆరీఫ్ అలీ తెలిపారు. ఈ సందర్భంగా బీబీకా అలావాను సర్వాంగా సుందరంగా ముస్తాబు చేశారు. ఈనెల 19న నెలవంక కనిపిస్తే.. 20వ తేదీ నుంచి మొహర్రం సంతాప దినాలు ప్రారంభమవుతాయన్నారు. మొహర్రం సంతాప దినాలు ప్రారంభమైన అనంతరం 6వ రోజున ఏనుగు అంబారీపై ఆలంల ట్రయల్ ఉంటుందన్నారు. 10వ మొహర్రం సందర్భంగా షియా ముస్లింలు మాతం నిర్వహిస్తారన్నారు.

వాయిస్ కళాకారులకు ఉజ్వల భవిష్యత్



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మామిడి హరికృష్ణ

గన్‌ఫౌండ్రీ: ఔత్సాహిక వాయిస్ కళాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక సౌజన్యంతో సురభి కళాక్షేత్రం, దుర్గాబాయ్‌దేశ్‌ముఖ్ మహిళా సభ సాహిత్య ఇల్లు ఆధ్వర్యంలో వాయిస్ వర్క్‌షాప్ ముగింపు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విజ్ఞానాన్ని సంపాదించుకోవడంతో పాటు ఎప్పటికప్పుడు నూతన విషయాలు తెలుసుకోవాలని సూచించారు. నిరంతర సాధన విజయాన్ని అందిస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేయడంతో పాటు వర్క్‌షాప్ సీజన్–3 వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జే స్వాతి, రంగస్థల నటుడు డాక్టర్ సురభి రమేష్, డాక్టర్ సాయిఆచార్య పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడి మృతి

నాంపల్లి: రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడు మృతి చెందిన ఘటన నాంపల్లి రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సుమారు 30 ఏళ్ల గుర్తుతెలియని యువకుడు మంగళవారం ప్రకృతి చికిత్సాలయం–ఫతేనగర్ రైల్వేస్టేషన్ల మధ్యలో రైలు పట్టాలు దాటుతుండగా అటుగా వచ్చిన ఓ గుర్తుతెలియని రైలు ఢీకొట్టింది. దీంతో ఆ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గో సంరక్షణకు వాసవీ క్లబ్ నిరంతరం కృషి



గో పోషణలో పాల్గొన్న వేదల తిరుమల బద్రినాథ్, వరకుమార్‌గుప్తా

అబిడ్స్: గో సంరక్షణ కోసం వాసవీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నిరంతరం కృషి చేస్తుందని వేదాంత తిరుమల బద్రినాథ్, క్లబ్ అధ్యక్షుడు వరకుమార్‌గుప్తా పేర్కొన్నారు. సీతారామ్‌బాగ్‌లోని జగన్నాథ్‌మఠల్‌లో వాసవీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, వాసవీ గో సేవా సమితి ఆధ్వర్యంలో గోమాత పోషణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గోవుల సంరక్షణకు, గోవుల అభివృద్ధికి, గో ఉత్పత్తులకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పండ్లు, కూరగాయలు, వస్త్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బాదం వెంకటకృష్ణ, బాశెట్టి హరినాథ్, శ్యామ్‌గుప్తా, మంచాల అంబరిష్, ఆదగుళ్ల వెంకటేష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన నలుగురిపై కేసు

గౌలిపురా: ట్రాఫిక్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు దురుసుగా ప్రవర్తించిన నలుగురిపై మొఘల్‌పురా పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 17న బోనాల ఉత్సవాల సామూహిక ఘటాల ఊరేగింపును పురస్కరించుకొని బేలా చౌరస్తా ప్రాంతంలో మహంకాళి ట్రాఫిక్ ఎస్సై శశిధర్ కానిస్టేబుల్, హోంగార్డులతో కలిసి విధులు నిర్వహిస్తున్నాడు. అదే సమయంలో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న నలుగురు యువకులు ట్రాఫిక్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా మహంకాళి ట్రాఫిక్ ఎస్సై శశిధర్, కానిస్టేబుల్, హోంగార్డులతో దురుసుగా ప్రవర్తించి దుర్భాషలాడారు. దీనిపై ట్రాఫిక్ పోలీసులు మొఘల్‌పురా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తికి జైలు

డబీర్‌పురా: ప్రేమ పేరుతో వేధింపులకు గురి చేస్తున్న కేసులో ఓ వ్యక్తికి మంగళవారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణరావు 8 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం.. డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధి చంచల్‌గూడకు చెందిన సయ్యద్ అక్బర్ హష్మీ స్థానికంగా ఉండే మెన్హాజ్ భాను చిన్న కూతురు మరియ భానును కొన్ని రోజులుగా ప్రేమ పేరుతో వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ విషయమై పలుమార్లు అక్బర్ హష్మీని కుటుంబ సభ్యులు హెచ్చరించారు. ఈ విషయంలో జోక్యం చేసుకోవద్దంటూ మరియ భాను సోదరుడిని సైతం బెదిరించాడు. దీనిపై మెన్హాజ్ భాను పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు సయ్యద్ అక్బర్ హష్మీ ఈ–పెట్టీ కేసు నమోదు చేశారు. అనంతరం పోలీసులు సయ్యద్ అక్బర్ హష్మీను నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టులో మంగళవారం హాజరుపరచగా మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణరావు సయ్యద్ అక్బర్ హష్మీ కు 8 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

స్వచ్ఛమైన పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యం



కాంగ్రెస్ నాయకులు కురకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: తప్పుడు ప్రచారంతో ప్రజలను బీజేపీ, బీఆర్‌ఎస్‌లు మభ్యపెడుతున్నాయని సీనియర్ కాంగ్రెస్ నాయకులు కురకుల కృష్ణ ఆరోపించారు. మంగళవారం కార్వాన్‌లో రైతుల విద్యుత్ కరెంట్‌పై టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ప్రకటనను వారు స్వాగతించారు. ప్రజలకు విద్యుత్‌ను సరఫరా చేయడంలో బీఆర్‌ఎస్ ఘోరంగా విఫలమైందని ఆయన ఆరోపించారు. స్వచ్ఛమైన పాలనను అందించడం కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆయన అన్నారు. కేసీఆర్ కుటుంబం తెలంగాణను దోచుకోవడమే లక్ష్యంగా పని చేస్తుందని ఆయన అన్నారు. కాగా కాంగ్రెస్‌కు రాష్ట్రంలో పక్కా ఓటు బ్యాంకు ఉందని, గత కొంత కాలంగా అన్ని వర్గాల ప్రజల నుంచి కాంగ్రెస్‌కు మద్దతు లభిస్తుందని ఆయన అన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా కూడా ప్రజలు కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడం ఖాయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో హమీద్ ఖాన్, చంటి బాబు, రవీందర్ తదితరులున్నారు.